క్లుప్తంగా

హెచ్ఐవీపై అవగాహన



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

పాకాల : మండలంలోని చెన్నుగారిపల్లి దళిత వాడలో హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. బుధవారం ఐఈసీ (ఇంట్రా ఎడ్యుకేషన్ కేర్) కార్యక్రమంలో భాగంగా ప్రోగ్రామ్ మేనేజర్ సద్దాం సూచనల మేరకు పీర్ ఎడికేటర్ బాలాజీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి హెచ్ఐవీపై కరపత్రాలు పంపిణీ చేశారు. బాలాజీ మాట్లాడుతూ ఎయిడ్స్‌కు మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని వెల్లడించారు. వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని, సంక్రమించే సుఖ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

యాజమాన్యంతోనే అధిక దిగుబడి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

పాకాల : పంటల సాగులో యాజమాన్య పద్ధతుల పాటిస్తే స్థిరంగా అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి కేవీ.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని అమ్మగారిపల్లెలో వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ పుష్పావతి మాట్లాడుతూ రైతులందరూ విధిగా మట్టి నమూనా పరీక్షలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రమేష్, ఎంపీఈఓ రవి, వీఏఏ కౌశిక్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

తిరుపతి(అలిపిరి): తిరుపతి శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో బుధవారం రొంపిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లెలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్ మాట్లాడుతూ స్త్రీలకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచకర్మ విభాగాధిపతి డాక్టర్ హర్షవర్ధన్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి, స్థానికులు రామనాథం నాయుడు, కృష్ణమనాయుడు, భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల అభ్యున్నతే లక్ష్యం



మాట్లాడుతున్న హనుమంతరావు

తిరుపతి కల్చరల్ : బ్రాహ్మణుల అభ్యున్నతే లక్ష్యంగా ఏపీ బ్రాహ్మణ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో రుణమేళా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు చిత్రపుర హనుమంతరావు తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మాసోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి ప్రసంగించారు. గత ఏడేళ్లలో సొసైటీ ద్వారా రూ.14 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సూక్ష్మ రుణాలు, ఆచార్య మిత్ర, అర్చక మిత్ర, శ్రీవారి సేవా మిత్ర, సత్యవేద సేవా మిత్ర, సమాచార మిత్ర, పురోహిత మిత్ర వంటి పథకాలతో పాటు వ్యక్తిగత, వ్యాపారాలు, స్థిరాస్తి రుణాలను అతి తక్కువ వడ్డీతో అందిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో సొసైటీ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ కుమార్, సీఆర్‌కే శేషగిరిరావు, ఆర్.ద్రాక్షాయిణి, భాగవతుల జయలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా 'పల్లె పండుగ'



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాని

రామచంద్రాపురం: మండలంలోని మిట్టకండ్రిగ, కొత్తకండ్రిగ, కుప్పంబాదూరు, రాయలచెరువు, సీకాలేపల్లి, నెత్తకుప్పం, కొత్త వేపకుప్పం, అనుప్పల్లి, బొప్పరాజుపల్లెలో బుధవారం ఘనంగా పల్లె పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని సీసీరోడ్లు, డ్రైనేజీలకు ప్రారంభోత్సవం చేశారు. రాయలచెరువుకట్ట సమీపంలోని శ్రీ భవానీ జలకంఠేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు.

జీపీఎఫ్ అదాలత్ రేపు

తిరుపతి అర్బన్ : ప్రభుత్వోద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల జీపీఎఫ్ సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో అదాలత్ నిర్వహించనున్నారు. బుధవారం ఈ మేరకు జిల్లా ఖజానా అధికారి లక్ష్మీకర్‌రెడ్డి వెల్లడించారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దాడిపై యూట్యూబర్ ఫిర్యాదు

తిరుపతి అర్బన్ : గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని కిరణ్‌కుమార్ అలియాస్ అగ్గిపెట్టిన మచ్చ అనే యూట్యూబర్ బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టి అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

శ్రీనివాస కల్యాణ ఘట్టం ప్రదర్శిస్తున్న కళాకారులు (ఫైల్)



చారిత్రాత్మక నాటకంలో ఓ సన్నివేశం (ఫైల్)



రామాయణంలోని ఓ ఘట్టం ప్రదర్శిస్తున్న రంగస్థల నటులు



నాటకం.. నవరసభరితం

ఒకప్పుడు నాటక రంగం ఓ వెలుగు వెలిగింది. భారతీయ సంస్కృతి విశిష్టతను దశదిశలా చాటింది. స్వాతంత్రోద్యమ సమయంలో జాతిని ముందడుగు వేయించింది. సమాజంలో అసమానతలను ఎత్తిచూపింది. అస్పృశ్యతను రూపుమాపేందుకు తన వంతు పాత్ర పోషించింది. ప్రేక్షకులను ఆహ్లాదపరుస్తూనే.. ఆలోచనలు రేకెత్తించే అపురూప కథలను కళ్లెదుట ఆవిష్కరించింది. పురాణ పురుషుల పాత్రలతో ప్రజలను సన్మార్గం వైపు నడిపించింది. అయితే నేటి ఆధునిక సమాజంలో నాటకం తెర మరుగవుతోంది. కళాకారులకు సైతం ఆదరణ కరువైపోయింది.

- సంస్కృతి.. సంప్రదాయాలకు దర్పణం
- జాతిని మేల్కొలిపిన చైతన్య రూపకం
- ఆహార్యం.. అభినయం.. ఆంగిక సమాహారం
- ఆధునిక సమాజంలో నాటక రంగానికి తగ్గిన ఆదరణ
- తెరమరుగవుతుండడంపై కళాకారుల ఆవేదన

తిరుపతి కల్చరల్ : మహత్తర చైతన్య రూపకంగా నాటకం సుమారు రెండు శతాబ్దాల క్రితం ఆవిర్భవించింది. తొలి నాటక రంగ ప్రయోక్త కందుకూరి వీరేశలింగం పంతులు. ఆయన రచనలో 1880లో మొట్టమొదట రాజమండ్రిలో ప్రదర్శించిన ×వ్యవహార ధర్మ బోధిని× తొలి తెలుగు నాటకం. అప్పటి నుంచి నాటకాల ప్రస్థానం ఆరంభమైంది. సామాజిక అవసరంగా కొనసాగింది. తర్వాత గురజాడ అప్పారావు రాసిన ప్రథమ సాంఘిక నాటకం ×కన్యాశుల్కం× అశేష ప్రజాదరణ పొందింది. అప్పటి నుంచి రామాయణ, మహాభారతం వంటి ఇతిహాసాలు, సతీ సావిత్రి, నల్లతంగ, చిన్నమదేవి వంటి అపురూపమైన కథలు నాటకాలుగా ప్రజల ఆదరణ పొందాయి.



సాంఘిక నాటకంలో ఓ సన్నివేశం (ఫైల్)

ఖాళీ స్థలాలే వేదికలుగా..

1940లోనే తిరుపతి నాటకాలకు నిలయంగా మారింది. అప్పట్లో చిత్తూరు నాగయ్య సారథ్యంలో నాటకాలు ప్రదర్శిస్తూ ప్రేక్షకులను అలరించేవారు. తిరుపతిలో ఒక ఖాళీ స్థలాన్ని గుర్తించి అక్కడ పందిళ్లు వేసి తాటి మట్టలతో తడికలు, పట్టలు కట్టి టిక్కెట్ పెట్టి నాటకాలు ప్రదర్శించే వారు. తర్వాత త్యాగరాజ మండపం, రైల్వేస్టేషన్ వద్దనున్న అప్పటి బాలాజీ భవన్ నాటక ప్రదర్శనలు సాగేవి. సుమారు 50 మంది నటులు అప్పట్లో విశేషంగా నాటకాలు ప్రదర్శించి ప్రజాదరణ పొందారు. కాలక్రమేణా నాటకాలు తగ్గుముఖం పట్టాయి. తిరుపతిలో సాంస్కృతిక వేదికగా మహతి కళాక్షేత్రం ఏర్పాటు కావడంతో నాటకాలు ప్రదర్శన మళ్లీ మొదలయ్యాయి. దాతల సహకారంతో అప్పుడప్పుడు మహతి కళాక్షేత్రంలో వివిధ సాంస్కృతిక కళా సంస్థలు నాటకాలు ప్రదర్శిస్తూ కళాకారులను, కళలను నమ్ముకున్న వివిధ విభాగాలకు చెందిన వారిని ప్రోత్సహిస్తున్నారు. అయినా నేడు నాటకాలను ఉచితంగా ప్రదర్శిస్తున్నా ఆదరణ లేకుండా పోతోంది. సినిమాలు, టీవీలు, సెల్‌ఫోన్ల మోజుతో ముఖ్యంగా యువత పూర్తిగా దూరమైంది. ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో సుమారు 600 మందికి పైగా కళాకారులు, నాటక ప్రదర్శనలను ఆదరించే సాంస్కృతిక సంస్థలు ఉన్నప్పటికీ ప్రస్తుతం ప్రేక్షకులే కరువయ్యారు.

కళను కాపాడుకోవాలి



శ్రీకృష్ణదేవరాయుల పాత్రలో కోనేటి సుబ్బరాజు

మంచి చేస్తే కలిగే ప్రయోజనాలను సందేశంగా ప్రదర్శించే నాటకం సమాజ శ్రేయస్సుకు చక్కటి తార్కాణం. నా తండ్రి వీధి నాటక కళాకారుడు. ఆయనకు అందిన గౌరవం చూసి నేను కూడా నాటక రంగంలోకి వచ్చా. 1974లో బాలనటుడుగా ప్రవేశించా. అప్పటి నుంచి అనేక లఘు నాటకాలలో నటుడుగా రాణిస్తూ 1980లో గుర్తింపు పొందా, టీటీడీ ఉద్యోగిగా పనిచేస్తూనే రంగస్థలిలోనూ రాణించా. సుమారు 40 ఏళ్లుగా పౌరాణికం, సాంఘిక నాటకాలలో ఎనలేని పాత్రలు పోషించి ప్రేక్షకలోకం ఆదరణ పొందడం మహద్భాగ్యం. నాటక సంస్థని ప్రారంభించి సుమారు 60 మంది కళాకారులతో దేశ వ్యాప్తంగా నాటకాలు ప్రదర్శించి శభాష్ అనిపించుకున్నాం. శ్రీనివాస కల్యాణం, విరాట పాండవీయం వంటి నాటకాలను వాస్తవాలకు దర్పణం పట్టే సెట్టింగ్ ప్రదర్శనలతో అబ్బుర పరిచాం. శ్రీనివాస కల్యాణం నాటకానికి బంగారు నంది అవార్డు పొందడం అదృష్టంగా భావిస్తా. అంతేకాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు ఎవరికీ దక్కని నాటక రంగ చక్రవర్తి బళ్లారి రాఘవ నేషనల్ అవార్డు అందుకోవడం మరువలేని ఘట్టం. సంస్కృతి, సంప్రదాయ నాటక కళను కాపాడుకోవాలి.



– కోనేటి సుబ్బరాజు, కళాకారుడు

సందేశంతో చైతన్యం



చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి పాత్రలో..

సంస్కృతి, సంప్రదాయానికి అద్దం పడుతూ చక్కటి సందేశంతో చైతన్యపరిచేదే నాటకం. శతాబ్దాలుగా మానవీయతను మేల్కొలిపి జాతిని సన్మార్గంలో నడిపిన నాటకం అంతరించిపోయే దుస్థితికి చేరుకోవడం దురదృష్టకరం. సినిమాలు, టీవీలు, సెల్‌ఫోన్లు కారణంగా దాదాపు వెనకబడిపోయింది. సుమారు 50 ఏళ్లుగా వేలాది పాత్రలు, వందలాది నాటికలు ప్రదర్శించాం. ప్రజల చప్పట్లతో కళా జీవితం ఎంతో సంతృప్తిగా సాగింది. 9వ తరగతి చదివేప్పుడు అనార్కలి నాటకంలో బాల నటుడిగా నాటక జీవితం ఆరంభమైంది. సినీ దర్శకుడు కోదండరామిరెడ్డి, నటుడు రాజనాలతో ఉన్న స్నేహం కారణంగా సినిమాల్లో సైతం నటించా. కడపలో బెమ్మడు గిరిజన పాత్రలో నటిస్తే వైఎస్.రాజారెడ్డి సైతం కంటతడి పెట్టిన ఘటన మరువలేను. అప్పట్లో ఆయన రూ.3వేలు బహుమతిగా ఇచ్చారు. పౌరాణిక, సాంఘిక నాటికలలో పలు పాత్రలు పోషించి అద్భుతమైన అవార్డులు, సత్కారాలు అందుకున్నా. నాటక రంగానికి ప్రభుత్వం, ప్రజలు ప్రోత్సాహం అందించాలి.



– కేఎస్ రాజా, కళాకారుడు

ఆదరణ పెరగాలి



భీష్మ పాత్రలో ఆమూరి సుబ్రమణ్యం

కుల,మత బేధాలు లేని రంగస్థలి వేదికలో సమానత్వాన్ని చాటుతూ అద్భుత పాత్రలతో సమాజాన్ని మేల్కొలిపే నాటకానికి మరింత ఆదరణ పెరగాలి. ఎంతో మక్కువతో 1983లో నాటక రంగంలోకి ప్రవేశించా. ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూనే పౌరాణిక, సాంఘిక నాటకాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించా. రాగయుక్తంగా పద్యాలు ఆలపిస్తూ రంగస్థలి నటుడుగా అనేక అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నా. నాటకంలో చెడును, మంచిని బేరీజు వేస్తూ చేసే పాత్రలు సమాజానికి ఎంతో అవసరం. ఆట విడుపు కోసమే అయినా నాటకం ప్రతి మనిషిలో ఆలోచలను రేకెత్తించి వారిలో మార్పునకు నాంది పలుకుతాయి. అలాంటి ఘటనలు నా 35 ఏళ్ల నాటక జీవితంలో చాలా కనిపించాయి. నటుడుగానే కాక ప్రభుత్వ నంది నాటక పోటీలలో జడ్జిగా వ్యవహరించా. నాటకం ఒక చైతన్య దీపిక వంటిది. అలాంటి నాటక రంగం, నటులు సమాజ హితానికి ఉపయోగపడతారు.



– డాక్టర్ ఆమూరు సుబ్రమణ్యం, రంగస్థలి నటుడు

సమ సమాజానికి దిక్సూచి



బృహన్నల పాత్రలో జీకే సుందరం

మంచి చెడుల సంఘర్షణల మధ్య విజయం మంచితనం వైపు నిలుస్తుంది. ఇందుకు తార్కాణాలు రామాయణ, మహాభారతంలోని ఘట్టాలు. ఇలాంటి వాటిని నాటకంగా రంగస్థలిపై ప్రదర్శించి తద్వారా ప్రజల్ని చైతన్యాన్ని రేకెత్తించి సన్మార్గంలో నడిపే చరిత్ర నాటకాలదే. వృత్తి రీత్యా నేను బ్యాంక్ ఉద్యోగిని. అయినా నాటకం పట్ల మక్కువతో బ్యాంక్ ఉద్యోగుల కల్చరల్ ద్వారా అన్నమయ్య నాటకంలో మహావిష్ణువు పాత్రతో మీ రంగంలో ప్రవేశించా. ఆకాశ వాణిలో బీ గ్రేడ్ ఆర్టిస్ట్‌గా లలిత సంగీతంలో అటు కర్ణాటక సంగీతంలో డిప్లొమా పొందడంతో అద్భుత రాగ ప్రావీణ్యంతో ప్రతి పాత్రను అవలీలగా మెప్పించి అశేష మన్ననలు అందుకున్నా. అప్పటి నుంచి సుమారు 35 ఏళ్లుగా నాటక రంగంలో రాణిస్తూ పౌరాణికం, సాంఘిక నాటికాల్లో ఎనలేని పాత్రలు పోషించా. పలు పురస్కారాలతోపాటు బంగారు నంది అవార్డు అందుకోవడం ఒక మహద్భాగ్యం. సమాజాన్ని, మనుషులను మంచి వైపు పయనింపజేసే నాటకాలు నేడు ఆదరణకు నోచుకోక పోవడం తీరని లోటు. నాటక కళను మరింత అభివృద్ధి చేసి కళామతల్లి వికాసానికి తోడ్పడాలన్నది నా ఆకాంక్ష.



– జీకే సుందరం, రంగస్థలి నటుడు

భూమనకు ఆత్మీయ సత్కారం

తిరుపతి సిటీ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డిని పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బి.ఓబుళ్‌రెడ్డి బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు, కమిటీ ఏర్పాటు, విద్యారంగంపై ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం, విద్యార్థి విభాగాన్ని పటిష్టం చేయడంపై భూమన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం నేతలు వెంకటేష్, భూపాల్, ఓబులేసు, రాజ్ కుమార్, శ్రీనివాసులు, ముబారక్, మంజునాథ్, నందకిషోర్, మధు, భాను కుమార్, రవి పాల్గొన్నారు.



కరుణాకరరెడ్డిని సన్మానిస్తున్న ఓబుల్ రెడ్డి తదితరులు

కమాండ్ కంట్రోల్ పనులపై సమీక్ష

తిరుపతి తుడా : ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై బుధవారం తిరుపతి స్మార్ట్‌సిటీ ఎండీ, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య సమీక్షించారు. పనుల ఆలస్యంపై కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన గడువు లోపు త్వరితగతిన పనులు పూర్తి చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అధికారులు, నిర్మాణ నిర్వాహకులు సమన్వయం చేసుకుని పనులు వేగం పెంచాలని సూచించారు. కంట్రోల్ సెంటర్ అందుబాటులోకి వస్తే నగరంలో భద్రత మరింత పెరుగుతుందని, వాహనాల రాకపోకల నియంత్రణ, కాలుష్య నియంత్రణ, యూజర్ చార్జీల వసూలు, అపరాధ రుసుము విధింపు తదితరాలు సులభతరమవుతాయని వివరించారు. సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యామ్‌సుందర్, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి కల్చరల్: విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మీటర్ రీడర్ల సంఘం గౌరవాధ్యక్షుడు బాలకాశి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం గంధమనేని శివయ్య భవన్‌లో మీటర రీడర్ల సంఘం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో జీతాలు పెరుగుతాయని ఆశిస్తే, తగ్గించారని మండిపడ్డారు. గతంలో అర్బన్ పరిధిలో ఒక సర్వీసుకు రూ.3.60 పైసలు, రూరల్ పరిధిలో రూ.3.73 పైసలు ఉంటే, ఇప్పుడు అర్బన్ పరిధిలో రూ.2.80 పైసలు, రూరల్ పరిధిలో రూ.3.60 పైసలు ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు నారా లోకేష్ స్పందించాలని కోరారు. లేకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. సంఘం రాష్ట్ర కోశాధికారి రమేష్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ మీటర్ రీడర్ల సంఘం నేతలు

నరసింగాపురంలో గ్రామసభ

చంద్రగిరి : మండలంలోని నరసింగాపురం పంచాయతీలో బుధవారం తహసీల్దార్ శివరామసుబ్బయ్య అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మ్యుటేషన్, జాయింట్ ఎల్‌పీఎంలు, భూ తగాదాలు, సెక్షన్22(ఎ) అభ్యంతరాలపై ప్రజల నుంచి ఫిర్యాదు తీసుకున్నట్లు తెలిపారు. వాటిని పరిశీలించి ఆన్‌లైన్‌లో పొందుపరిచామని వెల్లడించారు. త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్ బాబు, గ్రామ సర్వేయర్ మమత, వీఆర్‌ఓ విజయ్ కుమార్ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శివరామసుబ్బయ్య

ఇళ్ల మధ్య వైన్‌షాపుపై నిరసన



నినాదాలు చేస్తున్న స్థానికులు

తిరుపతి కల్చరల్ : రైల్వేస్టేషన్‌కు సమీపంలోని కస్తూరిబాయి వీధిలో ఇళ్ల మధ్య వైన్‌షాపు ఏర్పాటు చేస్తుండడంపై స్థానిక మహిళలు బుధవారం నిరసన తెలిపారు. స్థానికులు శిరీష, జ్యోతి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో యాత్రికుల రద్దీ అధికంగా ఉంటుందన్నారు. ఇదే వీధిలో పాఠశాల, గోవిందరాజస్వామి ఆలయం కూడా ఉందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో మందుబాబుల కారణంగా మహిళలు, విద్యార్థులు, భక్తులు తీవ్రంగా ఇబ్బంది పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో వైన్‌షాపు ఉండేదని, స్థానికుల విజ్ఞప్తి మేరకు మరోచోటుకి మార్చేశారని చెప్పారు. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకుని నివాసాలకు దూరంగా మద్యం దుకాణం ఏర్పాటు చేయించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు భూషణమ్మ, రమేష్, కృష్ణమ్మ, జయమ్మ, లక్ష్మమ్మ, మధు, కమలముని, కుమారి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

26న హిందీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఇంటర్వ్యూ

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ సబ్జెక్టుకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఈ నెల 26వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల అభ్యర్థులు శనివారం ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో కళాశాలకు రావాలని కోరారు. హిందీ పీజీలో 55 శాతం ఉత్తీర్ణత సాధించినవారు ఇంటర్వ్యూకు అర్హులని వెల్లడించారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు.

వైభవంగా పవిత్రాల సమర్పణ

చంద్రగిరి : శ్రీకోదండరామస్వామివారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం వైభవంగా పవిత్రాలు సమర్పించారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి కొలువు నిర్వహించారు. అనంతరం సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. ద్వార పూజ, కుంభారాధన, హోమం, లఘు పూర్ణాహుతి జరిపించారు. యాగశాలలో పవిత్రమాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి తీసుకెళ్లారు. అనంతరం మూలవర్లు, ఉత్సవర్లు, 12 మంది ఆళ్వార్లు, ఆంజనేయస్వామివారు, విష్వక్సేనులవారు, గరుడాళ్వార్‌కు, యాగశాలలోని హోమగుండాలకు, బలిపీఠానికి, ధ్వజస్తంభానికి, విమానగోపురానికి పవిత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరి పాల్గొన్నారు.



పవిత్రాలు సమర్పిస్తున్న అర్చకులు

సిరులతల్లి సేవలో సీతక్క

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని తెలంగాణ మంత్రి సీతక్క బుధవారం సాయంత్రం సేవించుకున్నారు. ఆలయం వద్ద ఆమెకు అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



అమ్మవారి ఆలయం వెలుపల తెలంగాణ మంత్రి సీతక్క